క్లుప్తంగా

శివభక్తుల పాదయాత్ర



శ్రీశైలం బయలుదేరిన శివస్వాములు

రాయవరం: గ్రామానికి చెందిన ఐదుగురు శివ భక్తులు శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. గ్రామానికి చెందిన గుడాల సూరిబాబు గురుస్వామి ఆధ్వర్యంలో రావాడ రామకృష్ణ, చింత ఈశ్వరరావు, కడియాల శివ, గుత్తుల సత్యనారాయణ శివస్వాములు శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. అక్కడకు చేరుకునేందుకు 13 రోజులు పడుతుందని సూరిబాబు తెలిపాడు.

ఇంటికెళ్లి.. సేవలందించి..



పడమర ఖండ్రికలో వైద్య పరీక్షలు చేస్తున్న గీతాంజలి

కపిలేశ్వరపురం: పడమర ఖండ్రికలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ శిబిరం నిర్వహించారు. అంగర పీహెచ్‌సీ వైద్యురాలు జీవీ గీతాంజలి శిబిరంలో 52 మందికి వైద్యసేవలందించారు. శిబిరానికి రాలేని వృద్ధులు, బాలింతల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. బీపీ, షుగరు తదితర సాధారణ పరీక్షలు చేసి వారి ఆరోగ్య రికార్డులో నమోదు చేశారు. శిబిరంలో హెల్త్ విజిటర్ తాతపూడి మేరీమణి, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎంపీహెచ్‌ఈఓ జుత్తుక మల్లిఖార్జునుడు, ఎంఎల్‌హెచ్‌పీ దేవీ, వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు సేవలందించారు.

కేదారిలంకలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కపిలేశ్వరపురం: తుపాను నేపథ్యంలో మండలంలోని లంక గ్రామమైన కేదారిలంకలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వానపల్లి పీహెచ్‌సీ వైద్యుల పర్యవేక్షణలో వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామంలో వైద్య సేవలందించారు. వాతావరణ పరిస్థితుల మేరకు గ్రామంలో ఆరోగ్య సూత్రాలపై సూచనలు చేశారు.

సిల్ట్ తొలగింపు



ప్రధాన డ్రైన్ సిల్టు తొలగింపు పనులను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: మున్సిపాలిటీలోని మెయిన్ రోడ్‌లోని బీఎస్ఎన్ కాలేజీ నుంచి కాకినాడ రోడ్డు వరకూ మెయిన్ డ్రైవ్ సిల్టు తీసివేత పనులు సోమవారం ప్రారంభించారు. ఈ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి పరిశీలించారు. మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదేశాల మేరకు డ్రైన్ సిల్టు తొలగింపు పనులకు రూ.18 లక్షలను కేటాయించి టెండర్లను పిలిచినట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు సిల్టు తీసివేత పనులను చైర్ పర్సన్ శ్రీదేవి ప్రారంభించారు. పట్టణ వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, పార్టీ నేత కుడిపూడి లలితాగణేష్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కాపవరంలో రక్తదాన శిబిరం

బిక్కవోలు: మండలంలోని కాపవరంలో మానవసేవ మాధవసేవ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ ప్రారంభించారు. స్థానిక యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మారెళ్ళ భీష్ముడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే ప్రారంభం

బిక్కవోలు: మండలంలోని ఆడుదాం ఆంధ్రా ఇంటింటి సర్వే సోమవారం ప్రారంభించారు. మండలంలోని 21 సచివాలయాల పరిధిలో 447 మంది వలంటీర్లు సర్వే చేస్తున్నారు. మొత్తంగా 47,609 మందిని సర్వే చేయాల్సి ఉండగా తొలిరోజు 13,831 మంది సభ్యులను అంటే 29.05 శాతం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పోస్టర్ అందజేశారు. ఈ నెల 15 నుంచి గ్రామ స్థాయి పోటీలు జరగనున్నాయి.

లక్ష బిల్వార్చన

అమలాపురం రూరల్: బండారులంక భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో కార్తిక సోమవారం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గుమ్మిడి సద్గురు సత్యనారాయణ ఆచార్య బ్రహ్మత్వంలో లక్ష బిల్వార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

ఓటు వజ్రాయుధం

- ఓటు నమోదు ప్రత్యేక శిబిరాలు పూర్తి
- రెండు నియోజకవర్గాల్లో 7,092 దరఖాస్తులు
- తొలి విడతలో 3,406, రెండో విడతలో 3,686
- జనవరి 5న తుది జాబితా విడుదలకు కసరత్తు



అంగర పోలింగ్ బూత్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కార్యాలయ ఏఓ ప్రకాష్

కపిలేశ్వరపురం: ప్రజాస్వామ్యంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ప్రాథమిక హక్కు అర్హులందరికీ అందించాలన్న లక్ష్యంతో భారత ఎన్నికల కమిషన్ నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3లలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించిన దరఖాస్తులను స్వీకరించింది. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ఆరు మండలాలకు గానూ రెండు విడతల శిబిరాల్లో 7,092 దరఖాస్తులందాయి. తొలి విడతలో 3,406, రెండో విడతలో 3,686 అందాయి. కొత్తగా ఓటు హక్కు కావాలంటూ ఫారం-6కు 3,854 మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండు నియోజకవర్గాల్లో ఇటీవల విడుదల చేసిన జాబితా ప్రకారం 4,13,395 మంది ఓటర్లు ఉన్నారు. జనవరి 5న తుది జాబితాను విడుదల చేసేందుకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది.

విజయవంతమైన ప్రత్యేక శిబిరాలు

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద నవంబర్ 4, 5, ఈ నెల 2, 3ల్లో శిబిరాలను నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. బూత్‌లెవెల్ అధికారులకు క్షేత్ర స్థాయిలో పోలింగ్‌స్టేషన్లను నిర్దేశిస్తూ విధులను కేటాయించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకూ కేంద్రంలో ఫారం 6, 7, 8 దరఖాస్తులను స్వీకరించారు. నమోదు ప్రక్రియపై సాయంత్రం నాలుగు గంటలకు ఉన్నతాధికారులకు రిపోర్టు ఇస్తూ చిత్తశుద్ధితో విధులను నిర్వహించారు. సూపర్‌వైజర్లు, సహాయ ఓటరు నమోదు అధికారులు కేంద్రాల్లోని విధులను పర్యవేక్షించారు.



ఓటరు జాబితా

మండపేట నియోజకవర్గంలో ..

మండపేట అర్బన్‌లో ఫారం-6 తొలివిడతో 225, రెండో విడత 260, మొత్తం 485 దరఖాస్తులు వచ్చాయి. ఫారం-7 తొలివిడతో 43, రెండో విడత 102, మొత్తం 145, ఫారం-8 తొలివిడతో 204, రెండో విడత 222, మొత్తం 426 దరఖాస్తులందాయి. మండపేట రూరల్‌లో ఫారం-6 తొలివిడతో 298, రెండో విడత 201, మొత్తం 499 దరఖాస్తులు అందాయి. ఫారం-7 తొలి విడతో 81, రెండో విడత 36, మొత్తం 117, ఫారం ఎనిమిది తొలివిడతో 213, రెండో విడత 88, మొత్తం 301దరఖాస్తులందాయి.

రాయవరం మండలంలో ఫారం-6 తొలివిడతో 310, రెండో విడత 253, మొత్తం 563 దరఖాస్తులు వచ్చాయి. ఫారం-7 తొలి విడతో 37, రెండో విడత 87, మొత్తం 124, ఫారం-8 తొలివిడతో 88, రెండో విడత 141, మొత్తం 229 దరఖాస్తులందాయి.

కపిలేశ్వరపురం మండలంలో ఫారం-6 తొలి విడతో 117, రెండో విడత 113, మొత్తం 230, ఫారం ఏడు తొలి విడతో 205, రెండో విడత 84, మొత్తం 289, ఫారం ఎనిమిది తొలివిడతో 51, రెండో విడత 37, మొత్తం 88 దరఖాస్తులందాయి.

మండపేట నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో ఫారం-6కు 1,777, ఫారం-7కు 675, ఫారం-8కు 954 దరఖాస్తులందాయి. మూడు రకాల ఫారాల దరఖాస్తులు కలిపి మొత్తం 3,406 దరఖాస్తులందాయి.

రామచంద్రపురం నియోజకవర్గంలో

రామచంద్రపురం అర్బన్‌లో ఫారం-6 తొలి విడతో 137, ఫారం-7 తొలి విడతో 71, ఫారం-8 తొలివిడతో 85 అందాయి. రామచంద్రపురం రూరల్ మండలంలో ఫారం-6 తొలి విడతో 222, ఫారం-7 తొలి విడతో 49, ఫారం-8 తొలివిడతో 106 దరఖాస్తులందాయి. కె.గంగవరం మండలంలో ఫారం ఆరు తొలివిడతో 292, ఫారం ఏడు తొలివిడతో 44, ఫారం ఎనిమిది తొలివిడతో 185 దరఖాస్తులందాయి. కాజులూరు మండలంలో ఫారం ఆరు తొలి విడతో 365, ఫారం ఏడు తొలి విడతో 99, ఫారం ఎనిమిది తొలివిడతో 54 దరఖాస్తులందాయి.

రామచంద్రపురం నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో ఫారం-6కు తొలి విడతలో 1,016 రెండో విడతలో 1,061, మొత్తం 2,077, ఫారం-7కు తొలివిడతలో 263, రెండో విడతలో 675, మొత్తం 938, ఫారం-8కు తొలివిడతలో 430, రెండో విడతలో 241, మొత్తం 671 మూడు రకాల ఫారాలు కలిపి మొత్తం 3,686 దరఖాస్తులందాయి.

రెండు నియోజవర్గాల్లో ఓటర్లు ఇలా

మండపేట నియోజకవర్గంలో పురుషులు 1,05,084 మంది, స్త్రీలు 1,10,306 మంది ఇతరులు నలుగురు మొత్తం 2,15,394 మంది ఓటర్లున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో పురుషులు 98,417 మంది, స్త్రీలు 99,578 మంది, ఇతరులు ఆరుగురు మొత్తం 1,98,001 మంది ఓటర్లు ఉన్నారు. రెండు నియోజకవర్గాల్లో పురుషులు 2,03,501 మంది స్త్రీలు 2,09,884 మంది, ఇతరులు 10 మంది, మొత్తం ఓటర్లు 4,13,395 మంది ఉన్నారు.



ఓటు నమోదు శిబిరాలకు విశేష స్పందన

"ఓటు హక్కున అర్హత ఉన్నవారందరికీ కల్పించాలన్న లక్ష్యంతో ఎన్నికల కమిషన్ ఆదేశాలపై క్షేత్ర స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాం. ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఉన్నతాధికారుల ఆదేశాలపై రెండు రెండు విడతల్లో నిర్వహించిన శిబిరాల్లో దరఖాస్తులందాయి. వాటిని పరిశీలించి ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేస్తాం."

– కొమరం సూర్యారావు, తహసీల్దార్, కపిలేశ్వరపురం

శివాలయంలో ఎమ్మెల్సీ తోట పూజలు



తాపేశ్వరం శివాలయంలో పూజ చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): తాపేశ్వరం శివాలయంలో సోమవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గోపూజ, అభిషేకం చేశారు. ఆయనకు గ్రామ ప్రముఖులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్సీ తోట అభిషేక పూజలు చేయించారు.

భగవద్గీత ప్రచార కార్యక్రమం



వేములపల్లిలో ఆధ్యాత్మిక గ్రంథాలతో భక్తులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం వేములపల్లిలో సోమవారం త్రైత సిద్ధాంతం -ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదిక రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు శేఖర్ బాబు, సభ్యులు భరత్, జైరామ్, సత్యనారాయణ, ఆదిబాబు, సంధ్య, సూర్యకుమారి, జ్యోష్ణ మాట్లాడుతూ కార్తిక దీపం విశిష్టతను వివరించారు. భగవద్గీత సారాంశం ఉన్న పుస్తకాలను భక్తులకు అందజేశారు.

కలవరపెడుతున్న మిచాంగ్



కె.గంగవరంలో ధాన్యం తడవకుండా బరకాలు కప్పుతున్న రైతులు



పామర్రులో ధాన్యం రాసుల చుట్టూ చేరిన నీటిని మోటారు సాయంతో తోడుతున్న రైతు

- తుపానుతో కురుస్తున్న వర్షాలు
- ఆందోళనలో అన్నదాతలు

కె.గంగవరం: ఏటా ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాది పంట ఆశాజనంగా ఉన్న తరుణంలో వరుణుడు కన్నెర్ర చేశాడు. చేతికందే పంట చేజారుతుందేమోనని రైతులు కలవరపడుతున్నారు. ధాన్యాగారమైన రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో 6308 హెక్టార్లు, రామచంద్రపరం మండలంలో 6000 హెక్టార్లు, కాజులూరు మండలంలో 7200 హెక్టార్లలో ఈ ఏడాది రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట నియోజవకర్గంలోని మూడు మండలాల్లో కోత దశలో ఉంది. సుమారుగా 60శాతం పంట కోత కూడా కోసి ధాన్యాన్ని రోడ్లమీద, పొలం గట్లపై రైతులు ఆరబెట్టుకున్నారు. మరికొంత మంది రైతులు పనలను కోసి చేలోని వదిలేశారు. ఇలాంటి పరిస్థితిల్లో సోమవారం తెల్లవారు జాము నుంచి ఏకదాటిగా ఈదురు గాలులతో కురిసిన వర్షానికి రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట చేతికందే సమయంలో వర్షాలు పడితే నష్టపోయి అప్పుల పాలైపోతమాని రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాను ప్రభావరం వల్ల మరో రెండు మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణశాఖ వెల్లడించడంతో పాటు ఉదయం నుంచి వాతావరణం మబ్బులతో ఈదురు గాలులు, చినుకులు ఏకదాటిగా పండడంతో మరింత ఆవేదనకు గురవుతున్నారు. ముందోస్తు చర్యల్లో భాగంగా పంటను వర్షాల భారీ నుంచి కాపాడుకోవడానికి ప్రస్తుతం రైతులు నానా పాట్లు పడుతున్నారు.

ఈదురు గాలులతో వర్షం

కాజులూరు: మండలంలో వర్షం బీభత్సం సృష్టించింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి బలమైన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి మండల గ్రామాలలో అంధకారం నెలకొంది. స్థానికులు రోడ్లపై విరిగిపడిన చెట్టుకొమ్మలను తొలగించుకున్నారు.

ఎడతెరిపి లేని వర్షం

రామచంద్రపురం: మిచాంగ్ తుపాను నేపథ్యంలో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపిలేని వర్షం కురుస్తూనే ఉంది. అత్యధికంగా కె.గంగవరం మండలంలో 29.0 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా రామచంద్రపురం మండలంలో 25.2, కాజులూరు మండలంలో 20.9, కపిలేశ్వరపురంలో 15.2, మండపేటలో 8.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యాయి. తుపాను కారణంగా అన్ని పాఠశాలలను మూసివేశారు. భారీవర్షంతో చాలా రహదారులు జలమయమయ్యాయి. నియోజకవర్గంలో ఇప్పటికే మాసూళ్లు చివరి దశలో ఉన్న సమయంలో వర్షం కురవడంతో నిలిచిపోయాయి. పలు చోట్ల రోడ్ల మీదనే ధాన్యాన్ని బరకాలతో కప్పి ఉంచారు.

రైతుల ఆందోళన

రాయవరం: మిచాంగ్ తుపాను రైతుల ఆందోళనకు గురిచేస్తోంది. ఖరీఫ్ ఆశాజనకంగా ఉన్నా పంట చేతికొచ్చే సమయానికి వర్షాలు కురవడంతో అవస్థలు పడుతున్నారు. పంట ఒబ్బిడి చేసుకునే పనుల్లో బిజీగా ఉన్నారు. కొన్ని చోట్ల పంట పనలపై ఉండగా, కొన్ని చోట్ల కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని బరకాలతో కప్పుతున్నారు.

యంత్రాలపై కోతలకే ప్రాధాన్యం

రైతులు యంత్రాలపై కోతలకే ప్రాధాన్యమిస్తున్నారు. వరిచేను పడిపోతే పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందన్న ఉద్దేశంతో రైతులు యంత్రాలపై కోతలు కోయించారు. మండలంలో 90శాతం మేర స్వర్ణ రకాన్ని సాగుచేయగా మిగిలిన 10 శాతం ఇతర రకాలు సాగు చేశారు.



గొల్లపాలెంలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి ఇంటిపై విరిగిపడిన చెట్లు



జలమయంగా మారిన ద్రాక్షారామ, యానాంరహదారి



లొల్లలో బరకాలు కప్పి భద్రపర్చుకున్న ధాన్యం రాసులు

ప్రతి రైతును ఆదుకుంటాం



తర్లంపూడిలో ధాన్యం రాసులను పరిశీలిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- పంటల పరిశీలన

కాజులూరు: మిచాంగ్ తుపానుపై ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి వేణు గోపాలకృష్ణ పర్యటించి వర్షాలకు నీటమునిగిన పంట పొలాలను, ధాన్యం రాసులను పరిశీలించారు. ఈ సందర్భంగా తర్లంపూడిలో పలువురు రైతులు మాట్లాడుతూ వర్షాలు కారణంగా గ్రామాల్లో పంటను నష్టపోయిన ప్రతీ రైతును ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. మండల గ్రామాల్లో అధిక శాతం పంట కోతలు పూర్తయి ధాన్యం పొల్లాల్లో రాసుల రూపేనా ఉందన్నారు. వర్షాలకు నీరు రాసుల కిందకు వెళ్లితే ధాన్యం తడిసి రంగుమారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళనలకు గురవుతున్నారన్నారు. అయితే రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చెసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. వర్షం తెరపిచ్చిన వెంటనే ధాన్నాన్ని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులను ఆదేశించామన్నారు. ఇది రైతు ప్రభుత్వమని, రైతుల కష్టాలను తీర్చడంలో సీఎం జగన్ ఎప్పుడూ ముందుంటారన్నారు. కార్యక్రమంలో కాకినాడ జేడీఏ ఎస్.విజయ్‌కుమార్, కరప ఏడీఏ కె.బాబూరావు, మండల తహసీల్దారు బి.సాయిసత్యనారాయణ, తర్లంపూడి గ్రామ సర్పంచ్ నరాళ బాలరాజు, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగ కన్వీనర్ పెంకే వెంకటరమణ, పలువరు రైతులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కాజులూరు: బంగాళఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపానుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని కాజులూరు, చేదవాడ, బందనపూడి తదితర గ్రామాలలో ఆయన పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బందనపూడిలో ఆయన మాట్లాడుతూ మిచాంగ్ తుపాను ప్రభావంతో భారీవర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్నారు. మండల గ్రామాల్లో వరి కోతలు దాదాపు పూర్తి కావస్తున్నాయని ఇంకా మాసూళ్ళు నిర్వహించే రైతులు పంట పనలపై ఉండకుండా జాగ్రత్త పడాలన్నారు. పొలాల్లోనే కుప్పలుగా వేసిన బరకాలు కప్పి ఉంచాలన్నారు. వరి కుప్పలపైనా, ధాన్యం రాసులపైనా పడిన వర్షపునీరు భయటకు పోయేలా చుట్టూ కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒక వేల వరి పనలు, ధాన్యం నీట తడిసి ఉంటే గింజ మొలకలు రాకుండా ఉండేందుకు ఐదు శాతం ఉప్పుద్రావణాన్ని(లీటర్ల నీటికి 50 గ్రాములు చొప్పున ఉప్పు కలిపిన ద్రావణం) చల్లుకోవాలన్నారు. తుపాను వెళ్లిన తర్వాత నారుమడులు చల్లుకునే విధంగాను రైతులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు.

సర్వం.. శివోహం



సోమేశ్వరంలో ప్రత్యేక అలంకరణతో అలరారుతున్న సోమేశ్వరస్వామి

- శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రాయవరం: కార్తిక మాసం మూడో సోమవారం శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాలన్నీ శివనామ స్మరణతో మార్మోగాయి. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణాల్లోని పలు ఆలయ ఆవరణల్లో ఉన్న ధ్వజ స్తంభాలు, తులసి కోటలు, ఉసిరి, రావిచెట్ల వద్ద మహిళలు దీపారాధన చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశారు. పరమపావనుడైన రుద్రుడికి పంచామృతాలతో అభిషేకించారు. ఉదయం నుంచి ఉపవాసదీక్షను చేపట్టిన పలువురు మహిళా భక్తులు సాయంత్రం సమయాల్లో పురోహితులకు స్వయంపాకం అందజేసిన అనంతరం ఉపవాసదీక్షను విరమించారు. చారిత్రక శివాలయమైన సోమేశ్వరంలో పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో శ్రీబాలాత్రిపుర సుందరీ సోమేశ్వర స్వామిని నయనానందకరంగా అలంకరించారు. మండలంలోని వెంటూరు, చెల్లూరు, పసలపూడి, మాచవరం, రాయవరం, వెదురుపాక, వి.సావరం శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

భీమేశ్వరుని దర్శించుకున్న భక్తజనం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్రంలో వేంచేసి ఉన్న మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలాల్లో కార్తిక నోములకు సంబంధించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు రుత్విక్కులు నిర్వహించారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



రుత్విక్కులచే కార్తిక పూజలు నిర్వహించుకుంటున్న భక్తులు

శాంతి స్థాపనలో బ్రహ్మకుమారీల సేవలు ప్రశంసనీయం

అనపర్తి: ప్రపంచ శాంతి స్థాపనలో బ్రహ్మకుమారీల పాత్ర ప్రశంసనీయమని కాకినాడ చైతన్య గ్రూపుల సంస్థ చైర్మన్ చైతన్యరాజు పేర్కొన్నారు. అనపర్తిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో చైతన్యరాజు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 140 దేశాల్లో మానవులను శాంతి మార్గం, ఆధ్యాత్మికత వైపు పయనించేలా చేస్తున్న బ్రహ్మకుమారీల మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. వచ్చే నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు రాజానగరం గైట్ కళాశాల ప్రాంగణంలో తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నామని, ఈ సభలకు మూడు లక్షల మంది హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జ్ బీకే రజని మాట్లాడుతూ బ్రహ్మ బాబా చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ పయనిస్తూ శాంతి, దయ, ప్రేమతో జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈఎస్ ఇన్‌ఫ్రా చైర్మన్ ఎం.కేశవరాజు, స్థానిక సేవా కేంద్రం ఇన్‌చార్జ్ బీకే సుశీల, పీవీ కృష్ణంరాజు, డాక్టర్ ఎస్ఎస్ఎన్ రాజు, ఎంఎన్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మల్లిడి అనంత సత్యనారాయణరెడ్డి, జెడ్పీ మాజీ ప్రతిపక్ష నేత సత్తి రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని వినతి

తాళ్లరేవు: మండలంలోని పటవల పంచాయతీ పరిధిలోని పటవల, శాంతిమూల, కొత్తూరు, రామన్నపాలెం, రాఘవేంద్రపురం గ్రామాలకు చెందిన అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు స్థానికులు వినతి పత్రం అందజేశారు. సోమవారం స్థానిక సర్పంచ్ పినపోతు చినాకామేశ్వరరావు నేతృత్వంలో ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేను కలిశారు. 1977–79లలో పటవల పంచాయతీలో సుమారు 50 మందికి అసైన్డ్ భూములు, ల్యాండ్ సీలింగ్ భూములు ఇచ్చారని అయితే వాటికి పట్టాలు, పాస్‌పుస్తకాలు ఇవ్వలేదన్నారు. అప్పటినుంచి భూములను సాగు చేసుకుంటూ పొట్టనింపుకుంటున్నామని, ఆయా భూములకు సంబంధించి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో టేకుమూడి ఈశ్వరరావు, కొప్పిశెట్టి వెంకట్, వెంకట రమణ, శ్రీనివాస్, లోవబాబు తదితరులున్నారు.

ఘనంగా ఘంటసాల శతజయంత్యుత్సవం

తాళ్లరేవు: మండలంలోని పి.మల్లవరంలోని ధూళిపూడి గొల్లబాబు కల్యాణ మండపంలో ఘంటసాల శతజయంత్యుత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. న్యూఢిల్లీకి చెందిన ఆదిలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్, ఏఎన్ఆర్, మహానటి సావిత్రి కళావేదిక అధ్యక్షుడు ఉంగరాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గానావధానం, సంగీత విభావరి కార్యక్రమాలు జరిగాయి. అవధాన కార్యక్రమంలో పదిమంది కళాకారులు ప్రశ్నలు వేయగా డా.రెహంతుల్లా ఒకేసారి పది ప్రశ్నలకు జవాబులు చెప్పి ఆహుతులను ఆశ్చర్యచకితులను చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరిలో స్థానికులు సైతం పాటలు పాడి అలరించారు. ఆదిలీల ఫౌండేషన్ చైర్మన్ ఎస్.ఆదినారాయణ, తనికెళ్ల పార్థసారథి, కారక రాజబాబు, కనక రత్నమాల, ఆకుల శ్రీనివాస్, కామన ప్రభాకర్‌రావు, పుల్లెపు వెంకటేశ్వరరావు, వాకపల్లి చిరంజీవి, వల్లు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.